
రమాయణం

**కూరగాయలు కొనడం అనేది.. మా చిన్నతనంలో ఇంతలా లేదు. ఎందుకంటే.. మాకు అటు బావి దగ్గరా, ఇటు ఇంటి పెరట్లో అన్ని రకాల కూరగాయలూ పండేవి. ఒక్కవాన పడగానే.. ఇంటి వెనుక పాదులు, మళ్లూ చేసి.. బీర, చిక్కుడు, ఆనప, దోస, పొట్ల, బెండ, దొండ, వంకాయ, టమాట గింజలు అలికేది మా అమ్మ.**

# శంకరా!

మా పెరట్లో రకరకాల కూరగాయలతోపాటు.. పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతి కూర, గంగవాయిలి కూర, పుదీనా లాంటివి కూడా ఏడాది పొడవునా ఉండేవి. మాకు సరిపోగా మిగిలితే.. అందరినీ పిలిచి మరీ ఇస్తుండేవాళ్లం. నీళ్లు ఎప్పటికీ పారేచోట అరటి, చేమ, ఉల్లి లాంటివి పెంచేవారు. నాన్న ఎంతో శ్రద్ధగా ఓ రెండేళ్లపాటు క్యాబేజీ, కాలిఫ్లవర్ కూడా పండించాడు. వాటికెన్నడూ ఎరువులు కొని వేసింది లేదు. గొర్రె పెంటో, పశువుల పెంటో.. అంతే! ఒక్క ఆలుగడ్డలు మాత్రమే కిరాణా షాపులో కొనేవాళ్లం.

1976లో మేం కొత్త ఇల్లు కట్టుకున్నాం. అయితే, నిధుల కొరత వల్ల ప్రాజెక్టులు, వంతెనలు మధ్యలో ఆగిపోయినట్టుగా.. మా ఇంటి పనులు సగమే పూర్తయ్యాయి. ముఖ్యంగా ప్రహరీ పూర్తికాలేదు. అయినా.. మాకెంతో ఇష్టమైన పాత ఇల్లు కట్టి వందేళ్లయ్యిందనీ, ఏ ఎనగర్రో – దూలమో – వాసమో విరిగిపడే ప్రమాదముందనీ చుట్టాలంతా చెప్పడంతో కొత్త ఇంటికి మారక తప్పలేదు. దాంతో అమ్మ మళ్లీ జీరో నుంచి మొదలుపెట్టి.. కూరగాయల మొక్కలు నాటడం, బావి నీళ్లు చేది పోయడం ప్రారంభించింది. కానీ, ప్రహరీ లేకపోవడంతో చుట్టుపక్కల గొర్రెలు, మేకలు అన్నీ వచ్చి తిని పోతుండేవి. తొందరగా గోడ కట్టించమని నాన్నతో అంటుండేది అమ్మ. ఆయన మాత్రం.. నవ్వి ఊరుకునేవాడు. మొత్తానికి అలా మా ఇంట్లో ఏవో పాదులు, పూల మొక్కలు తప్ప.. కూరగాయలు పండించడం అప్పటికి కాస్త తగ్గింది. ఈలోగా శంకరయ్య అనే ఒకాయన తోపుడు బండిలో కూరగాయలు అమ్మడం మొదలు పెట్టాడు. హైదరాబాద్‌లో మాత్రమే అలా బండ్ల మీద అందంగా పేర్చిన కూరగాయలు, పండ్లు అమ్మడం చూసిన మేం.. మా ఊరికి, మా ఇంటి ముందుకే అలా కూరగాయల బండి రావడంతో ఉబ్బితబ్బిబ్బయ్యాం. ఎన్టీఆర్ పుణ్యమా అని.. మా నాన్న ఎన్నో ఏళ్లుగా చేస్తున్న కరణీకం పోయింది. అనావృష్టి, కరువు వల్ల ఒక్క బావి నీరున్న చోట ఏడాదికి ఒక్కసారే వరి పంట తప్ప మరే ఆధారమూ లేదు. దాంతో ఇరవై నాలుగుగంటలూ పొలం దగ్గరికి వెళ్లే అవసరమూ, ఆసక్తీ పోయి.. చాలా నిరాశగా ఉండేవాడు నాన్న.



ఆ సమయంలో శంకరయ్య.. నాన్నకు ఒక సోర్స్ ఆఫ్ స్పీచ్ అయ్యాడు. వారిది వ్యాపారస్తుల కుటుంబమే అయినా.. శంకరయ్య బీదవాడు. నాన్నలోని గుమ్మడినీ, అమ్మలోని అంజలీదేవినీ తొందరగానే గుర్తించాడు. దినం విడిచి దినం ఉదయం తొమ్మిది – పది గంటల మధ్య వచ్చేవాడు. నాన్న అప్పటికే.. ''ఇంకా శంకరయ్య రాలేదేందో?!'' అని ఎదురు చూస్తుండేవాడు. ఇంటి ముందరికి రాగానే బండి ఆపి.. ''ఏమాయె! బండొచ్చింది. కూరగాయలు తీసుకోరా?!'' అంటూ లోపలికి వచ్చేవాడు శంకరయ్య. అప్పటికే అమ్మ వంటపనిలో ఉండేది కనుక.. నాన్నే వెళ్లేవాడు. శంకరయ్యకు కావాల్సిందీ అదే!

ఎన్నడూ ఇంట్లో ఏం వండుతున్నారో కూడా తెలుసుకోని నాన్నను.. మొత్తానికి బండి దగ్గరికి రప్పించగలిగాడు శంకరయ్య. ఏవో ముచ్చట్లు చెప్పేవాడు. ఓ నోట్ బుక్‌లో నాన్న పేరిట ఓ పేజీలో రోజువారీ ఏం కూరగాయలు ఇచ్చాడో రాయించుకుని.. నెలకో, పదిహేను రోజులకో డబ్బు వసూలు చేసేవాడు.

కూరగాయల కోసం వారానికి ఒకటి రెండుసార్లు సాయంత్రం పూట ట్రైన్‌లో వరంగల్ వెళ్లేవాడు శంకరయ్య. కూరగాయల మార్కెట్ మూసివేసే సమయానికి.. మిగిలిపోయిన కూరగాయలు వచ్చినకాడికి అమ్మే టైంలో చాలా చీప్‌గా కొనేవాడు. ఆ రాత్రి మార్కెట్‌లోనే పడుకుని తెల్లవారుతూనే కాకతీయ ప్యాసింజర్‌లో రిటన్ వచ్చేవాడు. వాటినే ఊళ్లో తిరుగుతూ అమ్మేవాడు. మేం వేరేవాళ్ల దగ్గర కొన్న తాజా కూరగాయలు కట్ చేస్తున్నప్పుడు శంకరయ్య చూశాడంటే చాలు.. ''అయ్యో! వేరేటోళ్ల దగ్గర ఎందుకు కొన్నరు?! నేనిద్దగద!'' అంటూ అలిగేవాడు. ''ఇప్పుడే తెంపుకొచ్చిన మని ఎవరో పొస్తె కొన్నం!'' అనో.. ''మా ఇంట్ల కాసినవి కూడా వొండుకోవద్దా?!'' అనో అమ్మ చెబుతుండగానే.. నాన్న ఏదో సర్ది చెప్పేవాడు. వెంటనే.. ''మరి మీ ఇంట్లయి నాకు పెట్టరా?!'' అని అడిగేవాడు. ''అయ్యో! ఎందుకు పెట్టం?! కొన్ని తీసుకపో!'' అని అమ్మో , నాన్నో.. అతనికి మా ఇంట్లో కాసినవే కాకుండా, ఎవరైనా పంపినవి కూడా పెట్టేవారు.

ఒక్క కూరగాయలేనా? చింతపండు, కారప్పొడి, మక్కజొన్న కంకులు, బియ్యం.. ఇలా ఎన్నో సరుకులు అడిగి తీసుకువెళ్లేవాడు. కొన్నాళ్లకు మేం ఇంట్లోకి ఏవి తెచ్చుకున్నా, ఏది తిన్నా.. శంకరయ్య వాటా తీసిపెట్టడం అలవాటైంది. చివరికి వంటకోసం, వేడినీళ్ల పొయ్యి కోసం నాన్న కట్టెలు కొట్టించి పెడితే.. ''నాకు కట్టెలొద్దా?! పండుగకు నేను అప్పాలు ఎట్ల జేసుకోవాలె?!'' అని తనే వెళ్లి, కట్టెలు మోపుగా ఏరుకుని తీసుకెళ్లేవాడు. చివరికి.. ''నాకు దసర పండుగకు కొత్తంగి కుట్టియ్యవా దొరా!'' అని నాన్న దగ్గర డబ్బులు అడిగి.. షర్ట్ కుట్టించుకునేవాడు. ''కూరగాయలు ఏమన్న పుణ్యానికి ఇస్తున్నడా? బొచ్చెడు పైసలు తీసుకుంటున్నడు. మనం అన్ని ఉత్తగ ఎందుకియ్యాలె?!'' అని నానమ్మ అనేది. ''పోనీలే పాపం! ఏదో మిడుకుతున్నడు.. పేద బక్కోడు. ఎట్ల బతుకుతడు?!'' అనేవాడు నాన్న.

ఓసారి శంకరయ్య కూరగాయల బండి కర్రలన్నీ ఊడి పాడైపోయింది. నాలుగైదు రోజులు అతను రాలేదు. ఆ నాలుగు రోజులూ నాన్న టెన్షన్ అంతా ఇంతా కాదు. చివరికి.. విషయం తెలుసుకొని రమ్మని మా జీతగాణ్ని వాళ్ల ఇంటికి పంపాడు. ఆ తరువాత వారానికి తళతళలాడుతున్న కొత్తబండిలో.. అవే వాడిపోయిన కూరగాయలతో దర్శనమిచ్చాడు శంకరయ్య. కొన్నాళ్లకు అభిజ్ఞవర్గాల ద్వారా ఆలస్యంగా తెలిసిన సమాచారం ఏమిటంటే.. మా నాన్నే ఇంట్లో ఉన్న పెద్దేగి కర్రలు కొన్ని, బావి దగ్గర చెట్టు కొట్టించి కొన్ని.. మొత్తానికి ఆ బండికి పట్టే కర్రంతా ఇచ్చాడని! ఆ విషయం చరిత్ర కాలగర్భంలో కలిసిపోయి చాలారోజులు రహస్యంగానే ఉండిపోయింది.

అలా ముప్పై ఏళ్లకు పైగా మా ఇంటితో ప్రత్యేక అనుబంధం పెంచుకున్నాడు శంకరయ్య. 2006లో నాన్న చనిపోయిన రోజు.. ఆయన్ను చూడటానికి ఎంతో మంది బంధుమిత్రులు వచ్చారు. ఆ పల్లెటూళ్లో వారం దరికీ భోజనాలెలా ఏర్పాటు చేయాలని మా వాళ్లు అనుకుంటుంటే.. శంకరయ్యే ముందుకొచ్చాడు. ''మా దొర కోసం గిదిగూడ జెయ్యనా?! నేను ఒండుత!'' అంటూ.. రెండొందల మందికి వంట చేసిపెట్టాడు. అనారోగ్యంతో శంకరయ్య మరణించాడని తెలిసినపుడు.. ఈ జ్ఞాపకాల తేనెతుట్టె కదిలింది. ■



**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**